కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలి



డీసీసీ అధ్యక్షుడితో శ్రీకాంత్‌గౌడ్

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీని బూత్‌స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని మేడ్చల్–మల్కాజిగిరి డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన బండారం శ్రీకాంత్‌గౌడ్ డీసీసీ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం లభిస్తుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో విజయం దిశగా కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కృష్ణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, బండారి రఘు, మహేష్ యాదవ్, నరేందర్ యాదవ్, మణికంఠ, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యాప్రాల్‌లో ఉర్సు ఉత్సవాలు



అల్వాల్: యాప్రాల్‌లోని అప్పగారి ఆశ్రమంలో యధేఫాజిల్ ఉర్సు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. హజ్రత్ ఖాజా మోహమ్మద్, సిద్దిపేట ఆశ్రమ పీఠాధిపతి హకీం షరీఫ్ చిష్మిల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధన ఉత్సవాలు జరిగాయి. అదేవిధంగా జెండా, గంధం ఊరేగింపు, ఖవ్వాలి నిర్వహించారు.

ఇంటి పన్నుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

బోడుప్పల్: అపార్ట్‌మెంట్, ఇంటి యజమానుల ఇంటి పన్నుల బకాయిల చెల్లింపుల కోసం ఆదివారం పలు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ జి.వేణు గోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చెంగిచర్ల బస్తీ దవాఖానా మెయిన్ రోడ్డు, చెంగిచర్ల జలమండలి కార్యాలయం, హేమానగర్ కమ్యూనిటీ హాల్, బాలాజీ హిల్స్ కమ్యూనిటీ హాల్, రాజీవ్‌నగర్ కమ్యూనిటీ హాల్, బొల్లిగూడ కమ్యూనిటీ హాల్, లక్ష్మినగర్ ఓపెన్ జిమ్ వద్ద, మారుతీనగర్ కమ్యూనిటీ హాల్, శ్రీలక్ష్మినగర్ కాలనీ, గణేష్ మండపం వద్ద, నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద బిల్లు కలెక్టర్లు అందుబాటులో ఉంటారన్నారు. బిల్లులు చెల్లింపుల సమయంలో ప్రజలకు ఎలాంటి సందేహాలున్నా 040–27215959 ను సంప్రదించాలని కోరారు.

నేడు మల్లన్న కల్యాణం



గౌతంనగర్: మల్కాజిగిరి శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో గౌతంనగర్ డివిజన్ మల్లిఖార్జునగర్ మల్లన్న దేవాలయంలో మల్లన్న జాతర నిర్వహించనున్నట్లు సంఘం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మల్లన్న కళ్యాణం, బోనాల జాతర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: సంపత్ చిత్తారి కాలనీలో శనివారం కార్పొరేటర్ శాంతిశ్రీ నివాస్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ రంజిత్‌రెడ్డి, జలమండలి శేఖర్, విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు మల్లేష్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, మహేష్, సుమన్, సందీప్, అంజయ్య, మహేందర్, సాయిలత, సింధుప్రియ తదితరులు పాల్గొన్నారు.

12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఈ నెల 12న నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి కోరారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. అల్బెండజోల్ మాత్రలను పాఠశాల వయస్సు పిల్లలకు వేయడం ద్వారా నులిపురుగుల నిర్మూలన లక్ష్యంగా ముందుకెళ్లాని డీఎంహెచ్‌ఓ రఘునాథ్‌స్వామి సూచించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ మీడియా అధికారి అంజయ్య, వైద్యాధికారులు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు ప్రాక్టికల్ ఎగ్జామ్

ఘట్‌కేసర్: అనురాగ్ విశ్వవిద్యాలయానికి చెందిన 26 మంది ఎన్‌సీసీ కేడెట్లు ప్రాక్టికల్ ఎగ్జామ్‌కు హాజరయ్యారు. రెండు సంవత్సరాలు శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న కేడెట్లకు సికింద్రాబాద్‌లోని బైసన్ గ్రౌండ్‌లో శనివారం ప్రాక్టికల్ ఎగ్జామ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీటీఓ డాక్టర్ సి.మల్లేశ్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎన్‌ఎఫ్‌సీ ఉద్యోగి మృతి

కుషాయిగూడ: గుండెపోటుతో ఓ ఉద్యోగి మృతిచెందాడు. ఈ ఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్‌ఎఫ్‌సీ)లో చోటు చేసుకుంది. మహమ్మద్ జానీ(59) చాలాకాలంగా ఎన్‌ఎఫ్‌సీలో వర్క్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం సంస్థలోని క్యాంటీన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. తోటి ఉద్యోగులు ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గుండెపోటు కారణంగానే మృతి చెంది ఉంటాడని వారు పేర్కొన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. జానీ మృతి పట్ల సహచర ఉద్యోగులు, సంస్థ వర్గాలు సంతాపం తెలిపారు.

ఆరె కులాన్ని ఓబీసీలో చేరుస్తాం

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మల్లాపూర్: దేశంలో అనేక సంస్కరణలు జరుగుతున్నాయని, రాష్ట్రంలోని ఆరె కులాన్ని ఓబీసీలో చేర్చడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. నాచారం ఏఎస్‌ఆర్ గార్డెన్‌లో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపల్లి శివాజీ ఆధ్వర్యంలో ఓబీసీ సాధన సభను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఓబీసీ జాతీయ మోర్చా అధ్యక్షులు లక్ష్మణ్, ఓబీసీ జాతీయ కార్యదర్శి మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని, అలాగే ఆరె కులానికి కూడా అందిస్తున్నామన్నారు. కేంద్రంలో అనేక ఓబీసీ మంత్రులు ఉన్నారని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంతమంది ఓబీసీ మంత్రులు ఉండటం గర్వకారణం అన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి ఆరె కుల రాష్ట్ర నాయకులు ఓబీసీ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, త్వరలో వారి కల నెరవేరుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజసభ సభ్యుడు కె.లక్ష్మణ్ మాట్లాడారు. ఆరె కులం చాలా వెనుకబడి ఉందని, ఆరె కులానికి ఓబీసీ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని, ఆరె కులస్తులు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఆరె కులస్తులకు ఓబీసీ ఇవ్వకపోవడానికి గత ప్రభుత్వాలే కారణమన్నారు. మాజీ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరత్వం, పౌరుషం, చరిష్మా గురించి తెలియని వారుండరన్నారు. ఆరె కులస్తులకు 100 శాతం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రామారావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్, ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మాజీ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్, నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ ఓబీసీ చైర్మన్ భాస్కర్, రాష్ట్ర కన్వీనర్ రాజేష్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోర్తాల చందన్‌రావు, సోమిడి అంజన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వెంకటాపురంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శనివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సబితాఅనిల్‌కిషోర్‌తో కలిసి పర్యటించారు. కానాజీగూడ ఇందిరానగర్‌లో తాగునీటి సమస్య ఉందని, పలు సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రతి సమస్యను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో అనిల్‌కిషోర్‌గౌడ్, దేవయ్యగౌడ్, శ్రీనివాస్, మోసిన్, ప్రభాకర్, డిల్లీ పరమేష్, డోలి రమేష్, సాయికుమార్, రమాఅమృత, ఆశారాణి తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు



సీతారామ కాలనీలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ఈ మేరకు డివిజన్ పరిధిలోని సీతారామ కాలనీలో రూ.62 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను స్థానికులు, అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. బస్తీలు, కాలనీల్లో సీవరేజ్, స్ట్రామ్ వాటర్ డ్రైన్ పైపులైన్లు పూర్తయిన వెంటనే ప్రణాళిక ప్రకారం నూతన సీసీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బాలు, శ్యామ్, కొండల్ రెడ్డి, జగన్, రామానుజం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న డీటీవో కిషన్, ఆర్టీవో రవీందర్‌గౌడ్

ఉప్పల్: వాహనదారుల సంక్షేమమే ముఖ్యమని మేడ్చల్ జిల్లా రవాణా అధికారి కిషన్ స్పష్టం చేశారు. ఈమేరకు శనివారం ఉప్పల్ ప్రాంతీయ రవాణాశాఖ అధికారి రవీందర్ గౌడ్, సిబ్బందితో కలిసి ఉప్పల్ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకుని వాహనదారులు పాటించాలని సూచించారు. దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుందని, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి ప్రధాన కారణం అతివేగం అన్నారు. ఫోర్ వీలర్ నడిపే వారు సీటు బెల్టును ఖచ్చితంగా పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐలు జి.రవికుమార్, ప్రతాప్‌రాజ్, బి.అమృత వర్షిని, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రామకృష్ణ, ఇఫ్తేకార్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి

జీపీ ప్రత్యేకాధికారుల సమావేశంలో కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తమ విధులను బాధ్యతతో సక్రమంగా నిర్వర్తించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాష్ట్ర మంత్రి అనసూయ(సీతక్క) వీడియో కాన్ఫరెన్స్ అనంతరం శనివారం కలెక్టరేట్‌లో గ్రామ పంచాయతీ స్పెషల్ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు తమ విధులను ఎంతో జాగ్రత్తగా నిర్వర్తించాలని ఆయన సూచించారు. ప్రభుత్వం సూచించిన విధంగా నడుచుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పని చేయాలని కోరారు. ఈ నెల 7 నుంచి 15 వరకు నిర్వహించే స్పెషల్ శానిటైజేషన్ డ్రైవ్ (ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం) విజయవంతం అయ్యేలా ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఇందులో యువతను ప్రోత్సహించి వారిని భాగస్వామ్యం చేసి సమన్వయంతో విజయవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ఉపాధి హామీ కూలీల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

కుషాయిగూడ: చర్లపల్లి సబ్‌స్టేషన్–2, పలు ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఆదివారం కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పృథ్వీరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సురానా, ఫేజ్–2, మెహతమోడీ 11కేవీ ఫీడర్ల పరిధిలోని ఫేజ్–2 ఏరియాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

గద్దర్ పురస్కారాలు హర్షణీయం

మల్లాపూర్: కవులు, కళాకారులు, సినీప్రముఖులకు యుద్ధనౌక గద్దర్ పేరుతో పురస్కారాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినందుకు టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్ హెచ్‌ఆర్.మోహన్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం నాచారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గతం ప్రభుత్వం కవులు, కళాకారులను పట్టించుకోలేదన్నారు. బండారి రఘు, రాజు, అబ్రహం, అమర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పార్లమెంట్ స్థానానికి సత్యనారాయణ దరఖాస్తు

మేడ్చల్: మేడ్చల్ పట్టణానికి చెందిన అన్నె సత్యనారాయణ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థానాన్ని కేటాయించాలని నగరంలోని గాంధీ భవన్‌లో శనివారం దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పీసీసీ కార్యదర్శిగా, పీసీసీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా పని చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీ నా సేవలు గుర్తించి పార్లమెంట్ స్థానాన్ని కేటాయిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎంఆర్ సెట్‌లో ప్రాజెక్ట్ ఎక్స్‌పో

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ సెట్ కళాశాలలో సామాజిక ఆవిష్కరణలపై ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బడ్ టూ బిజినెస్ పేరిట ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. కార్యక్రమాన్ని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి ప్రారంభించగా అనంతరం విద్యార్థి బృందాలు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 3 బృందాలకు కార్యదర్శి గోపాల్‌రెడ్డి, సీఈఓ అభినవ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నారాయణ నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సురేశ్‌రామ్, వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కేలండర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్: పట్టణంలోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షుడు బర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో శనివారం ముదిరాజ్ సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ శశికళ, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్, రాధాకృష్ణముదిరాజ్, శ్రీశైలంముదిరాజ్, శంకర్‌ముదిరాజ్, పోచయ్య ముదిరాజ్, ఆంజనేయులు ముదిరాజ్, రవిముదిరాజ్, బలరాం ముదిరాజ్, లక్ష్మయ్యముదిరాజ్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులనూ త్వరలోనే పూర్తిచేస్తాం



సాయిప్రియ కాలనీలో యూజీడీకి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా డివిజన్‌లో శనివారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీరాంనగర్, సాయిప్రియ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రణాళికబద్ధంగా పరిష్కరిస్తూ ముందుకెళ్తానని తెలిపారు. పెండింగ్ పనులు కూడా త్వరలోనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, కాలనీవాసులు మధుకర్‌రెడ్డి, కొప్పుల కుమార్, జైని రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి ఎంపీ స్థానానికి సుశాంత్‌గౌడ్ దరఖాస్తు



మల్కాజిగిరి పార్లమెంట్‌కు దరఖాస్తు అందజేస్తున్న సుశాంత్‌గౌడ్

బోడుప్పల్: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ కోసం మేడ్చల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త సుశాంత్‌గౌడ్ శనివారం గాంధీ భవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. యువజన విభాగం కోటాలో తనకు టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు వెల్లడించారు. తనకు మేడ్చల్ జిల్లాలో అన్ని విభాగాల్లో పూర్తిస్థాయి మద్దతు ఉందని, తనకు టికెట్ కేటాయిస్తే గెలుస్తానని ఆయన చెంగిచర్లలో శనివారం వెల్లడించారు. ఈక్రమంలో తన మద్దతుదారులతో పెద్దఎత్తున తరలివెళ్లి దరఖాస్తు అందజేశారు. ఆయనకు మద్దతుగా వెళ్లిన వారిలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రుకువర్ధన్‌రెడ్డి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కో ఇన్‌చార్జి గణేష్‌నాయక్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుధీర్, పీర్జాదిగూడ నగర పాలక అధ్యక్షులు బొడిగె ఉదయ్‌రాజ్‌గౌడ్, ఉమేష్‌చారి, కరుణాకర్ రెడ్డి, శ్రవణ్ తదితరులున్నారు.

నృత్యోత్సాహం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాట్యం డాన్స్ అకాడమి గురువు సమతారావు శిష్య బృందంచే నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. గణేష్ పంచరత్న, పుష్పాంజలి, మల్లరి, మూషికవాహన, అయిగిరి నందిని, హనుమాన్ చాలీసా తదతర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

క్రమం తప్పకుండా ఫాగింగ్ చేపట్టాలి



ఎంటమాలజీ సిబ్బందికి సూచనలు చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: క్రమం తప్పకుండా ఫాగింగ్ చేపట్టి కాలనీల్లో దోమల వ్యాప్తి అరికట్టాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ పరమేష్, సిబ్బందితో ఆమె ఫాగింగ్ నిర్వహణపై శనివారం సమీక్ష నిర్వహించారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో ఫాగింగ్ జరిగేలా చూడాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకొని దోమల నివారణకు పాటుపడాలన్నారు.

నాణ్యతకు మారుపేరు జోయాలుక్కాస్



ఏఎస్‌రావునగర్‌లో జోయాలుక్కాస్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: అంతర్జాతీయంగా జువెలరీ రిటైల్, నాణ్యతకు మారుపేరు జోయాలుక్కాస్ అని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ సాయియామ్ మెహ్రా అన్నారు. ఏఎస్‌రావునగర్‌లో జోయాలుక్కాస్ జువెల్లరీస్ భవనాన్ని ఆధునీకరించిన అనంతరం తిరిగి శనివారం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కస్టమర్లకు నచ్చిన అన్ని రకాల ఆభరణాలను అందిస్తూ వారి మన్ననలు పొందుతూ ముందుకెళ్తున్నామని తెలిపారు. దేశాన్ని ఆభరణాల పర్యాటక కేంద్రంగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని పునరుద్ధరించడానికి ఆభరణాల ఔత్సాహికులకు వీలు కల్పించాయన్నారు. కార్యక్రమంలో జీజేసీ డైరెక్టర్, ఐజేఎస్‌ఎఫ్ కన్వీనర్ దినేష్ జైన్, జీజేసీ జాయింట్ కన్వీనర్ మనోజ్ ఝా, వైస్ చైర్మన్ రాజేష్ రోక్డే, ఏఎస్‌రావునగర్ మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యురాలు స్వప్న మాట్లాడుతూ కేన్సర్ పట్ల ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. నేటి సాంకేతికత సాయంతో కేన్సర్‌ను ముందుగానే గుర్తించవచ్చని, వైద్యంతో నివారించవచ్చని వివరించారు. ధూమపానం, మద్యానికి దూరంగా ఉండాలని తరచూ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, డీన్ రామదాసు, కన్వీనర్ శైలజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.